# నా స్మృతి పథంలో ఒక రోజు

- శ్రీమతి మాచిరాజు లక్ష్మి గంగా భవాని.

*గత సంచికలలో ...*

*మద్రాసు (నేటి చెన్నై), అలనాటి చెన్నపట్నం)లో బోర్డింగ్ అయ్యాక మాకై నిర్దేశించిన సీట్లలో కూర్చున్నాం! స్థూల శరీరంతో చేసి, సూక్ష్మ శరీరంమీద పడిన ముద్రలు చివరి మజిలీ వరకు చెరిగిపోవు. మద్రాసులో కంప్యూటర్‌లోకి ఎక్కిన సమాచారం, సింగపూర్ వెళ్ళినా, అమెరికాలో అడుగుపెట్టినా మారదు. చెక్కుచెదరకుండా అలాగే రికార్డయి వుంటుంది.* "నాకేం తెలియదు, నీ కరుణ తప్ప నాకేం అక్కరలేదు" అని గురువుని, భగవంతుణ్ణి ఆశ్రయిస్తే, శ్రమలేకుండా జీవుడు ఉత్తీర్ణుడు అయినట్టు అనిపించింది. ఒక యజ్ఞం పూర్తి అయినట్టు అయింది. అమెరికా విమానములో అడుగుపెట్టాం.

### శ్రీ గురుభ్యోనమ:

## అమెరికా ప్రయాణంలో అనుభవాలు

ఇంత దూరం సూర్యుడి ప్రక్కనే ప్రయాణం చేస్తున్నట్టు ఉంది. ఆకాశంలో సూర్యుడికి, క్రిందనున్న జీవరాసులకి, మధ్యలో మబ్బులు అడ్డం వచ్చినట్టు, ప్రక్కప్రక్కన వున్న సూర్యుడికి జీవులకి మబ్బులు అడ్డం వస్తున్నాయి. సముద్రాన్ని కప్పేసే అంత పెద్ద పొగ అతివేగంగా కమ్ముకుంది. అదేదో ధూమాకాశదర్శనంలా వుంది. మూడు నిమిషాల పాటు పూర్తిగా అదే పరిస్థితి, ఒక సెకెండ్ విరామం ఇచ్చింది. మళ్ళీ పొగ మొదలు. అది విమానం తాలూకు పొగ? ఇంకోటా? అన్నది తెలియదు. అది తొలిగాకా, సూర్యకాంతి పెద్దగా నీళ్ళమీద పరచినట్టు, ఆ వింత వెలుగులో, మబ్బులు, పెద్ద పెద్ద వృక్షాల్లాగా వున్నాయి. నీళ్ళలో కాంతి ఎఱ్ఱగా, బంగారంలా మెరిసిపోతోంది. పైన సూర్యుడు తెల్లగా, చల్లగా వున్నట్టు వుంది. సముద్రం అంతా మబ్బులతో ఏదో వ్యూహరచన చేసినట్టు వుంది. 4 గంటల 15 నిమిషాలకు వింత అనుభవం. సూర్యుడు సముద్రంతో సమానంగా వుండడంవలన, నీటి భాగం అంతా చీకటి అయిపోయినట్టు నల్లగా, పైన ఆకాశం తెల్లగా, మధ్యలో సూర్యుడు వింత గొలిపే కాంతులతో కిందికి దిగి పోతున్నాడు.

4 గంటల 25 నిమిషములకు సూర్యుడు క్రిందికి దిగినట్టు అనిపించినా, ఆ వెలుగు అలాగే వుంది. మధ్యలో కొంత నల్లమబ్బు అడ్డువచ్చి, ఇంకో ప్రక్కన సూర్యకాంతి ఎఱ్ఱగా, కొండలమీది చెట్లు అన్నీ ఒకేసారి మండిపోతున్నట్టుగా వుంది. క్షణంలో ఆ కాంతి విపరీతం అయిపోయి ఒక్క ప్రదక్షణ చేసినట్టు, అంతకు ముందు సముద్రంతో సమానం అయిపోయి, గర్భంలోకి దిగిపోయినట్టు కనబడిన సూర్యుడు, పూర్తి బింబంగా, అరుణకాంతితో దర్శనం ఇచ్చాడు. ఆ దృశ్యం జీవితంలో ఇంకెప్పుడూ

చూడలేనిది. అపురూపమైనది. అంతర్గతంగా వున్నాయని తెలుసుకున్న ఆకాశదర్శనాలు, కళాదర్శనాలు, అన్నీ ఏ శ్రమచెయ్యకుండానే బొందితో కైలాసం అన్నట్టు, అమృత సమానమైన ఆ దర్శనాల అనుభవంతో అమృతమే అందిందికాని, ఇంత దూరం సముద్రంపైన ప్రయాణమా! అని భయం కలగలేదు. అంతలో ఇంకో ప్రదక్షణ చేసినట్టు, అంతవరకు కుడివైపు వున్న, మంటలాంటి కాంతి ఎడమవైపు మారిపోయింది. ఆ కాంతి ప్రక్కన చాలా దూరం నల్లని మబ్బు, సముద్రం నలుపు, కుడివైపు ఈ చివర సూర్యకాంతి విచిత్రంగా వుంది. 4 గంటల 45 నిమిషములకు పొద్దు వాలినట్టు అయింది.

**అంతర్గతంగా వున్నాయని తెలుసుకున్న ఆకాశదర్శనాలు, కళాదర్శనాలు, అన్నీ ఏ శ్రమచెయ్యకుండానే బొందితో కైలాసం అన్నట్టు, అమృత సమానమైన ఆ దర్శనాల అనుభవంతో అమృతమే అందిందికాని, ఇంత దూరం సముద్రంపైన ప్రయాణమా! అని భయం కలగలేదు.**

12 నిమిషాల తక్కువ 5 గంటలకి, ఆకాశం పేదరాసి పెద్దమ్మ కుంకుం ఆరబోసిన రంగు వచ్చింది. 5 గంటలకి పూర్తిగా చీకటి అయిపోయింది. కాఫీ ఇచ్చారు. టి.వి.లో "హాంగ్ కాంగ్" వస్తున్నట్టు, ఫ్లైట్ సముద్రంపైన హాంగ్ కాంగ్‌కి ఎంత దూరంలో వున్నది, ఎన్ని నిమిషాలలో చేరబోయేది, చూపించారు. 10 నిమిషములు తక్కువ 6 గంటలకి హాంగ్‌కాంగ్ వచ్చింది. ఆకాశానికి అంటుకున్నాయా? అన్నట్టు ఎత్తయిన, తీరైన భవనాలు, తీర్చిదిద్దినట్టు వున్నాయి. విద్యుద్దీపాల కాంతులు చూస్తుంటే, మణి ద్వీప వర్ణన గుర్తు వచ్చింది. మణులతో కూర్చిన ద్వీపం లాగానే వుంది. నీళ్ళమీద విద్యుద్దీపాలు అలంకారంగా, జలదేవతకి పచ్చల హారం వేసినట్టు వుంది. (హారం ఆకారంగానే వున్నాయి) హాంగ్ కాంగ్ పట్టణ సుందరదృశ్యాలు అద్భుతంగా వున్నాయి, వర్ణనాతీతం. సముద్రంలో షిప్పులు దీపాలతో కనిపిస్తున్నవన్నీ, హరిద్వార్‌లో సాయంత్రం గంగపూజ చేసి, పువ్వులతో నింపి దీపాలు వెలిగించి గంగలో విడిచిన పడవల్లా వున్నాయి. విమానం క్రిందికి దిగుతుంటే భవనాలు తగులుతాయా! అన్నట్టు, వాటి మధ్యలోంచి వెళుతున్నట్టు అనిపించింది. "పరాశక్తి" సంకల్పమాత్రం చేత విచిత్రమైన విమానంలో, వారి ఇష్ట అయిష్టాలతో సంబంధంలేకుండా త్రిమూర్తులు ప్రయాణంచేసి వారివారి లోకాలలాంటివే చూసి గర్వభంగం అయిన ఘట్టం గుర్తువచ్చింది. కలలోనైనా ఊహించని చిత్రవిచిత్రమైన ప్రకృతి వైభవాన్ని చూసేందుకు ఈ కళ్ళు ఎన్ని జన్మల సుకృతం పోగుచేసుకున్నాయో!

ఎయిర్ పోర్ట్‌లో లెఖ్ఖలేనన్ని విమానాలు నిలిచిఉన్నాయి. సింగపూర్ కన్న మిన్నగా వుంది. 6 గంటల 10 నిమిషాలకి లేండ్ అయింది. మద్రాసు, సింగపూర్‌లలో మాదిరిగానే ఫ్లైట్‌లోకి వెళ్ళి వచ్చే మార్గాలు వున్నాయి. బస్ కాంప్లెక్స్‌లో ఏ నెంబరు ప్లాట్‌ఫారం దగ్గరకి వెళ్ళాలో, అక్కడికి బస్సు వెళ్ళి నిలిచినట్టు, నిర్ణయింపబడిన చోటుకి వెళ్ళి ఆగింది. ఇంచుమించుగా చాలా మంది దిగారు. అంతా అక్కడ ఖాళీ అయిపోయిందని అనుకున్నాను. కాని, అందరూ తిరిగి వచ్చేసారు. అమెరికా వచ్చాకా తెలిసింది, హాంగ్-కాంగ్‌లో దిగి అవసరాలు తీర్చుకోవచ్చు అని.

*(తరువాయి భాగం ఉగాది సంచికలో)*